

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

సోమవారం,2 ఫిబ్రవరి 2026

8 పేజీలు


## లోవమ్మ సన్నిధిలో

# ‘అవినీతి’లోగుట్టు

## భక్తుల సొమ్ము..అధికారుల వాటా?






ఎమ్మార్పీకి మించి మద్యం బాటిల్‌పై రూ.30 అదనపు దోపిడీ



ఆలయ ఈవో విశ్వనాధరాజు

- అమ్మ సన్నిధిలో సౌకర్యాల లేమి.. భక్తులు ఆవేదన
- అభివృద్ధి నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి భక్తులు డిమాండ్
- ప్రసాదాల తూకం నాణ్యతపై పెరగని పర్యవేక్షణ
- పూజా సామాగ్రి, కొబ్బరికాయలు ధరలు ఆకాశానికి..పర్యవేక్షణ ఏక్కడ.?
- దేవస్థానానికి డబ్బులు కట్టకుండా కొందరు షాపులు నిర్వహిస్తున్నారా..!
- ఈవో అండతో ఎమ్మార్పీకి మించి ప్రతి మద్యం బాటిల్‌పై రూ.30అదనంగా దోపిడి



“కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి తలుపులమ్మ లోవ సన్నిధిలో భక్తుల భక్తిని ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ప్రసాదం తూకంలో గోల్‌మాల్ చేస్తూ, ధరల పట్టికలు లేకుండానే పూజా సామాగ్రిని రెట్టింపు ధరలకు అమ్ముతూ సామాన్య భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. టోల్ గేట్ వద్ద సిబ్బంది రౌడీయిజం పరాకాష్టకు చేరగా, కనీస మంచినీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులు కల్పించడంలో దేవస్థాన యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. దుకాణాల సబ్ లీజు దందాలు, లక్షలాది రూపాయల బకాయిల వసూళ్లలో కార్యనిర్వహణ అధికారి ఉదాసీనత అనేక అనుమానాలకు తావిస్తోంది. కోట్లాది రూపాయల ఆదాయం, దాతల విరాళాల ఖర్చుపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పవిత్ర క్షేత్రంలో జరుగుతున్న అవినీతి లోగుట్టుపై ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణ జరిపి దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.. దీనిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో భక్తుల ప్రయోజనార్థం అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

# అంబటి..నీఅహంకారానికి అంతం దగ్గరపడింది!

## ‘ప్రజా హృదయ విజేత’ కొండబాబు రణ గర్జన

- చంద్రన్న జోలికొస్తే మాడ పగులుద్ది జాగ్రత్త..
- బూతుల బ్యాచ్‌కి చరమగీతం తప్పదు!
- ఐదు కోట్ల ఆంధ్రుల ఆరాధ్య దైవంపై విషం చిమ్మితే సమాధి చేస్తాం

ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తీవ్ర హెచ్చరిక



ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

“అంబటిరాంబాబు..నీనోటి దురదఅదుపులో లేకుంటే తోలు తీస్తాం జాగ్రత్త అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాస్‌వార్నింగ్ ఇచ్చారు. ఐదు కోట్ల ఆంధ్రుల ప్రాణం చంద్రబాబుపై అడ్డగోలుగా వాగితే అంబటిని రాజకీయంగా సమాధి తప్పదని, నీఅహంకారానికి అంతం దగ్గరపడిందని హెచ్చరించారు. తిరుమల శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన పాపాత్ములు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని, లేదంటే ప్రజలే నడిరోడ్డుపై బుద్ధి చెబుతారని నిప్పులు చెరిగారు. నీబూతు పురాణాలు ఇక సాగనివ్వమని కొండబాబు ఉగ్రరూపం దాల్చారు. అసలు మాజీ మంత్రివి అయి ఉండి నీవు మాట్లాడేది నోరా లేక మురికి కాలవా అనిప్రజలు అసహ్యించుకుంటున్నారని,అతిగా వాగితేతోలు ఒలిచిఉప్పురాస్తామని గర్జించారు. జగన్ రెడ్డి పెంపుడు జంతువుల్లా మొరగడం ఆపి, మర్యాదగా క్షమాపణ చెప్పకపోతే అంబటి రాంబాబుకు పుట్టగతులు ఉండవని కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.”

- మిగతా 2 లో..


## అన్నవరం క్షేత్రంలో

# అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం

### “కోటి తులసి పత్రి పూజ”

- లోక కళ్యాణార్థం, పాడిపంటల వృద్ధి కోసం శ్రీ సత్యదేవుని సన్నిధిలో మహా క్రతువు
- దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు ఘనంగా ఏర్పాట్లు
- ప్రెస్ మీట్‌లో వివరాలు వెల్లడించిన దేవస్థాన ఈవో వేంద్ర త్రినాధరావు





**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** కలియుగ వైకుంఠంగా భాసిల్లుతున్న రత్నగిరిపై, భక్తుల కొంగు బంగారం శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఒక అపురూప ఆధ్యాత్మిక సంబరానికి తెర లేచింది.రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.రామ చంద్ర మోహన్ ఉన్నత ఆశయాలకు అనుగుణంగా, రాష్ట్రం సస్యశ్యామలం గా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ “కోటి తులసి పత్రి పూజ” కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించను న్నారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని ఈవో ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి వేంద్ర త్రినాధరావు ఈ కార్యక్రమ వివరాలనువెల్లడించారు. **తులసి దళార్చన-సర్వదోషనివారణ..** ఈసందర్భంగా ఈవో త్రినాధ రావు మాట్లాడుతూ,

- తరువాయి 2లో..

# లోవమ్మ సన్నిధిలో 'అవినీతి' లోగుట్టు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన తలుపులమ్మ లోవ క్షేత్రం ప్రకృతి ఒడిలో వెలిసిన ఒక ఆధ్యాత్మిక వనం. రెండు కొండల మధ్య, సెలయేళ్ల నడుమ కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుంటే చాలు, సకల పాపాలు తొలగి కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడ అమ్మవారు భక్తుల గుండెల్లో కొలువై ఉన్నారని, తమ కష్టాలను కడతేర్చే "బంగారు తల్లి" అని భక్తులు పులకించిపోతారు. ఈ క్షేత్రం మరో విశిష్టత "వనభోజనాలు". దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులు కుటుంబ సమేతంగా ఆలయ పరిసరాల్లోని చెట్ల నీడన మట్టి పొయ్యిలు వెలిగించి, అమ్మవారికి ఇష్టమైన వంటలు వండుకుని అందరూ కలిసి ఆ ప్రసాదాన్ని స్వీకరిస్తారు. కానీ, ఇంతటి పవిత్ర క్షేత్రం నేడు కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల, సౌకర్యాల లేమితో వార్తల్లోకి ఎక్కింది.

**1. ప్రసాదంలో 'తూకం' మోసం..**అమ్మవారి ప్రసాదం అంటే భక్తులకు అమితమైన భక్తి. కానీ ఇక్కడ విక్రయించే పులిహోర, రవ్వలడ్డూ ధరలకు, బరువుకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. తూనికలు కొలతల చట్టం 2009 ప్రకారం ప్రతి పొట్లంపై బరువు వివరాలు వుండాలి. కానీ, ఎంత ధరకు ఎంత బరువు ఇస్తున్నారో దేవస్థానం లడ్డూ కవర్‌పై వున్నా... తక్కువ తూకంతో భక్తులను మోసగిస్తున్నట్లుగా భక్తులు ఆవేదన చెందుతున్నారు. 80 గ్రాములు ఉండాల్సిన లడ్డూ 75 గ్రాములే తూగుతోంది. ఆహార భద్రత చట్టం నిబంధనలను తుంగలో తొక్కి, నాణ్యత లేని ప్రసాదాన్ని భక్తుల నెత్తిన రుద్దుతున్నారు.

**2. 'బోర్డు' లేని దోపిడీ.. ఆకాశమే హద్దు!**

ఆలయ ప్రాంగణంలోని దుకాణాల్లో ధరల పట్టికలు మచ్చుకైనా కనిపించవు. కొబ్బరికాయలు,పూజా సామాగ్రిని ఇష్టానుసారంగా రెట్టింపు ధరలకు అమ్ముతూ సామాన్య భక్తుడి జేబుకు చిల్లు పెడుతున్నారు. బయట మార్కెట్ ధరలకు, ఇక్కడి ధరలకు ఏమాత్రం సంబంధం లేదు. అధికారుల పర్యవేక్షణ శూన్యం కావడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది.

**3. నిధుల లెక్కలేవి? శ్వేతపత్రం కావాలి!**

దేవస్థానానికి వచ్చే కోట్లాది రూపాయల ఆదాయం, దాతలు ఇచ్చే విరాళాలు ఏమవుతున్నాయి? గత కొన్నేళ్లుగా జరిగిన అభివృద్ధి పనులపై పారదర్శకత ఏది? ఏయే పనులకు ఎంత నిధులు వెచ్చించారు? అనే అంశాలపై కార్యనిర్వహణ అధికారి తక్షణమే ఒక "శ్వేతపత్రం" విడుదల చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భక్తుల సొమ్ముకు జవాబుదారీతనం లేకపోవడం విచారకరం.

**4. దుకాణాల కేటాయింపులో 'సబ్ లీజు' దందా**

దేవస్థాన పరిధిలోని దుకాణాల కేటాయింపు ప్రక్రియ ఒక పెద్ద ప్రహసనంగా మారింది. అసలు ఈ దుకాణాలను ఎవరెవరికి, ఏ ప్రాతిపదికన కేటాయించారో ఎవరికీ తెలియని రహస్యం.

**– అడ్డగోలు సబ్ లీజులు:** దేవాదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా, ఒకరు దుకాణాన్ని లీజుకు తీసుకుని, మరొకరికి భారీ ధరలకు సబ్ లీజుకి ఇస్తున్నా అధికారులు కళ్లున్నా కబోదుల్లా వ్యవహరిస్తున్నారు.

**–బకాయిల మాయాజాలం:** ఒక్కొక్క దుకాణం మీద దేవస్థానానికి రావాల్సిన బకాయిలు లక్షల్లో పేరుకుపోయాయి. ఈ బకాయిలను వసూలు చేయడంలో అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారు?

**5. టోల్ గేట్ వద్ద 'రౌడీజం'.. భక్తుల బెంబేలు**

క్షేత్రానికి వచ్చే వాహనాల విషయంలో టోల్ గేట్ మరియు పార్కింగ్ వద్ద సాగుతున్న అక్రమ వసూళ్లు పరాకాష్టకు చేరాయి.

– దౌర్జన్య వసూళ్లు: నిర్ణీత రుసుము కంటే అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తూ టోల్ గేట్ వద్ద సిబ్బంది రౌడీల్లా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే భక్తులపై బూతు పురాణం అందుకుంటూ, దౌర్జన్యానికి దిగుతున్నారు.

**– నిబంధనల ఉల్లంఘన**: రశీదులు లేకుండానే అక్రమ వసూళ్లు సాగుతున్నాయి. భక్తితో వచ్చే భక్తులు ఈ రౌడీ మూకల ప్రవర్తనతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇవన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**6. గాలికి పోయిన భక్తుల సౌకర్యాలు**

ఆదాయం పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కనిపించడం లేదు. ఎండలో మైళ్ల దూరం వచ్చే భక్తులకు కనీసం చల్లని మంచినీరు దొరకని పరిస్థితి. వసతి గదుల కొరత భక్తులను వేధిస్తుంటే,అపరిశుభ్రమైన శౌచాలయాలు నరకాన్ని చూపిస్తున్నాయి.క్షేత్రపవిత్రతను కాపాడాల్సిన పారిశుధ్య వ్యవస్థ పడకేసింది.

**7. దర్యాప్తుకు డిమాండ్.. ఈఓ మౌనం!**

ఈ మొత్తం అక్రమాలకు కార్యనిర్వహణ అధికారి బాధ్యతారాహిత్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ మరియు అవినీతి నిరోధక శాఖ తక్షణమే రంగంలోకి దిగి లోతైన విచారణ జరపాలని భక్తులు కోరుతున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని అవినీతి అడ్డాగా, రౌడీయిజానికి నిలయంగా మారుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.దీనిపై వివరణ కోరడానికి కార్యనిర్వహణ అధికారికి ఫోన్ చేయగా ఆయన ఫోన్ మాట్లాడటానికి అందుబాటులోకి రాలేదు.

# అంబటి.. నీ అహంకారానికి అంతం దగ్గరపడింది!

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**"అంబటి రాంబాబు.. నీ నోటి దురద అదుపులో లేకుంటే తోలు తీసి ఉప్పు రాస్తాం జాగ్రత్త" అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఐదు కోట్ల ఆంధ్రుల ప్రాణం చంద్రబాబుపై అడ్డగోలుగా వాగితే అంబటిని రాజకీయంగా సమాధి చేస్తామని, నీ అహంకారానికి కాలం చెల్లిందని హెచ్చరించారు. తిరుమల శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన పాపాత్ములు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని, లేదంటే ప్రజలే నడిరోడ్డుపై బుద్ధి చెబుతారని నిప్పులు చెరిగారు. చంద్రన్న జోలికొస్తే అంబటిని పాతాళంలోకి తొక్కేస్తామని, నీ బూతు పురాణాలు ఇక సాగనివ్వమని కొండబాబు ఉగ్రరూపం దాల్చారు. జగన్ రెడ్డి పెంపుడు జంతువులా మొరగడం ఆపి, మర్యాదగా క్షమాపణ చెప్పకపోతే అంబటి రాంబాబుకు పుట్టగతులు ఉండవని కొండబాబు ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఆయన సొంత ఇంట్లో పాత్రికేయుల సమావేశాన్ని ఎమ్మెల్యే కొండబాబు నిర్వహించారు.

**జగన్ అడ్డాలో 'రాజకీయ ఉగ్రవాదుల' పెంపకం!**

వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తన రాజకీయ మనుగడ కోసం నాయకులను 'రాజకీయ ఉగ్రవాదులుగా'మార్చిరాష్ట్రంపైకి వదులుతున్నారని ఎమ్మెల్యే కొండబాబు విరుచుకుపడ్డారు. ఆదివారం జగన్నాథపురంలోని తనక్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో సాగుతున్న ప్రతి బూతు మాట వెనుక జగన్ రెడ్డి హస్తంఉందనిదుయ్యబట్టారు.ముఖ్యమంత్రిచంద్రబాబు నాయు డుపై అంబటి రాంబాబు చేసినవ్యాఖ్యలుఅత్యంత నీచమని, ఒక మాజీ మంత్రికి ఉండాల్సినకనీససంస్కారంఅంబటిలోలేకపోవడంశోచనీయమ న్నారు.

**వెంకన్నను మోసం చేసిన పాపాత్ములు! అని కొండబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.**

గత ప్రభుత్వంలో పాలు, నెయ్యి లేకుండా కల్తీ రసాయనాలతో శ్రీవారి ప్రసాదాలను అపవిత్రం చేసి, భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని కొండబాబు మండిపడ్డారు. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో రూ.250 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడి, ఆ పాపాలను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు ముఖ్యమంత్రిపై విషం చిమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. "నీ అరాచక మాటలకు, అవినీతి అక్రమాలకు కాలం దగ్గరపడింది.. ప్రజలు నిన్ను రాజకీయంగా పాతాళానికి తొక్కేయడం ఖాయం" అని అంబటిని హెచ్చరించారు.

**కొండబాబు పిలుపుతో కదిలిన టీడీపీ సైన్యం:** ఎమ్మెల్యే కొండబాబు పౌరుష గర్జనకు మద్దతుగా ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. అంబటి రాంబాబు తీరును ముక్తకంఠం తో ఖండించిన వారిలో...నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గ్రంధి నారాయణరావు, పంతాడి రాజు, నేమాని సత్యనారాయణ, గెడ్డం పూర్ణచంద్రశేఖర, గుమ్మల్ల వెంకటేశ్వరరావు మరియు పలువురు ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనఘా దత్త క్షేత్రంలో మహా బృంద నృత్యం

**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** శాస్త్రీయ నృత్యకళాకారుల సంక్షేమ సమాఖ్య వారిచే... నాట్య శాస్త్రకర్త భరతముని జయంతి ఉత్సవం సందర్భంగా 600 మంది విద్యార్థులచే మహా బృంద నృత్యం జూనియర్, సీనియర్ నృత్యకారులచే నృత్య కార్యక్రమం అనఘా దత్తక్షేత్రంలో అద్భుతంగా జరిగింది. శ్రీపాద వల్లభ అనఘా దత్త క్షేత్రం, పిఠాపురం శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ మరియు శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ వారి ఆశీస్సులతో ఆలయ ట్రస్ట్ మెంబెర్స్ ఆధ్వర్యంలో... (మాఘ పౌర్ణమి) సందర్భంగా అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామి వారికి పంచామృత అభిషేకం, దత్తాత్రేయ స్వామి వారి ఉత్సవమూర్తికి తైలాభిషేకం, గోపూజ, పౌర్ణమి సందర్భంగా పంచోత్సవ సేవలు (పల్లకి సేవ, మండపోత్సవ సేవ, రథోత్సవ సేవ, తెప్పోత్సవ సేవ, మరియు డోలోత్సవ సేవ),గణపతిసహితదత్తహోమం మరియు అనఘావ్రతములు, విశిష్టమైన పంచోత్సవ సేవలు ఘనంగా జరిగాయి. భక్తులందరికీ ఉచిత మెడికల్ క్యాంప్, భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

# కాపుజాతి అభ్యుదయానికి సహకరించుకుందాం



**కొత్తపేట,మేజర్‌న్యూస్ :** కాపులు అంతా ఐక్యతతో ఉంటూ జాతి అభ్యుదయానికి కృషిచేయాలని పలువురు కాపు నేతలు సూచించారు. కొత్తపేట దివంగత సలాది స్వామి నాయుడు(అబ్బాయి కాపు) ఆయన స్వగృహం వద్ద సలాది రామకృష్ణ ఆధ్వర్యంలో కాపుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల నుండి కాపు నాయకులు, కాపు సంఘం నేతలు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాపు రిజర్వేషన్ పోరాట సమితి ద్వారా అబ్బాయి కాపు చేసిన సేవలను స్మరించుకున్నారు.కాపు జాతికి చెంది వెనుకబడిన వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించుకోవాలని సూచించారు.అలాగే సాంఘిక, ఆర్థిక,ఆరోగ్యం,విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని కొనియాడారు. పార్టీలకు అతీతంగా సమస్యలను పరిష్కరించుకుంటూ జాతి బలోపేతానికి సహకరించుకోవాలని అన్నారు.ఇతర కులాలను గౌరవిస్తూ సోదరుభావంతో ఉండాలంటూ హితవు పలికారు.ఈ సంఘం ద్వారా రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

# అన్నవరం క్షేత్రంలో అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం

మొదటిపేజి తరువాయి

తులసి దళం పరమాత్మకు అత్యంత ప్రీతిపాత్రమైనదని, కోటి తులసి దళాలతో స్వామివారిని అర్చించడం వల్ల అశ్వమేధ యాగం చేసినంత పుణ్యఫలం లభిస్తుందని పేర్కొన్నారు. దేవస్థానంలో తెలిసి తెలియక జరిగే ఉపద్రవాల నివారణకు, స్వామివారి తేజస్సు వృద్ధి చెందేందుకు ఈ వైదిక క్రతువును తలపెట్టినట్లు తెలిపారు.

**ప్రకృతి అనుకూలత – రైతు సంక్షేమమే లక్ష్యం**

ఈ పూజ కేవలం వ్యక్తిగత శ్రేయస్సు కోసమే కాకుండా, సమస్త లోక హితం కోసమని ఈవో వివరించారు.

–రైతు లోకానికిమేలు: రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు వృద్ధి చెందాలని సంకల్పించారు.

–పంచభూతాల ఆశీస్సులు: గాలి,నీరు,ఆకాశం వంటి పంచభూతాలు మానవాళికి అనుకూలించి, ప్రకృతి వైపరీత్యాలు కలగకుండా ఉండాలని ప్రార్థించనున్నారు.

–విద్యార్థుల ప్రగతి: విద్యార్థులు విద్యలో రాణించి, సమాజానికి వెలుగునివ్వాలని ఈ పూజలో ప్రత్యేక సంకల్పం చేయనున్నారు.

**పది రోజుల వైదిక వేడుక**

వైదిక కమిటీ సూచనల మేరకు ఫిబ్రవరి 06వ తేదీ మాఘ బహుళ పంచమి నుండి 15వ తేదీ వరకు ఈ వేడుకలు సాగుతాయి.

– నిర్వహణ: 60 మంది ప్రముఖ ఋత్వికులతో వేదపారాయణలు, లింగార్చన, సూర్య నమస్కారాలు నిర్వహించబడతాయి.

– ముగింపు: ఫిబ్రవరి 15న ఉదయం రుద్రహోమం, అనంతరం గం.11.00లకుపూర్ణాహుతితోఈమహా క్రతువు సంపూర్ణమవుతుంది.

భక్తులకు అరుదైన అవకాశం

ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు ప్రత్యక్షంగాలేదా పరోక్షంగా పాల్గొనేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది:

– ముఖ్య ఉభయదాతలు రూ.50,000లు : వీరు ఒక రోజు పూజలో ప్రత్యక్షంగా పాల్గొనవచ్చు. 10 రోజుల పాటు వీరి గోత్రనామ పఠనం జరుగుతుంది.దంపతులకు పట్టు వస్త్రాలు ప్రసాదంగా అందజేస్తారు.

– అర్చన టిక్కెట్లు రూ.1,500లు : భక్తులు కోరిన ఒక రోజున వారి పేరున పూజ నిర్వహించి, వస్త్ర ప్రసాదాన్ని కండువా,జాకెట్టు, అక్షింతలు ప్రత్యక్షంగా లేదా పోస్టల్ ద్వారా అందజేస్తారు.

**విరాళాల విజ్ఞప్తి:** దాతలునగదు,వస్తు లేదా తులసి పత్రి రూపంలో విరాళాలు అందజేయవచ్చు.రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పులకించేలా నిర్వహిస్తున్న ఈఅఖండపూజలోపాల్గొని,సత్యదేవుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఈవో వేంద్రత్రినాథరావు కోరారు. ఈ పాత్రికేయుల సమావేశంలో వైదిక పండితులు తదితరులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకో...!

– తక్షణం సీఎం చంద్రబాబుకు క్షమాపణ చెప్పు

– టిడిపి రాష్ట్ర నాయకులు ముప్వా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు






ఎటపాక, మేజర్ న్యూస్ : క్యారెక్టర్ లేని కొంతమంది మాజీ మంత్రులు స్థాయి మరచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అసభ్యంగా విమర్శించడం చాలా దురదృష్టకరమని టిడిపి రాష్ట్ర నాయకులు ముప్వ శ్రీనివాస్, ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, ఎటపాక మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, సొసైటీ అధ్యక్షులు మాచినేని రాజేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై నాయకులు తీవ్రంగా స్పందించారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఖండించి తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న పెట్టుబడులను చూసి ఓర్వలేక వైకాపా వారు మాటలతో ఇలా దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుపై అంబటి చేసిన వ్యాఖ్యలను తాము జీర్ణించు కోలేకపోతున్నామన్నారు. తమ నాయకుడు చంద్రబాబు నాయుడు తమకు నేర్పిన క్రమశిక్షణ, ప్రజాస్వామ్యం గురించి తాము బాధ్యతగా ఉంటున్నామన్నారు. అందుకే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ లైన్ దాటరన్నారు. కానీ ఈరోజు తమ దైవ సమాన నాయకుడు చంద్రబాబుపై అసభ్య "ల"కారాలతో మాట్లాడారని అ నుంచి అమ్మహ్ వరకు అకారాలతో తమ పార్టీ వాళ్లు కూడా మాట్లాడగలరని పేర్కొన్నారు. కానీ ప్రజాస్వామ్యంలో మన స్థాయిని గుర్తుంచుకోవాలన్నారు. కడప ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి సతీమణిపై కామెంట్ చేసినోడిని సస్పెండ్ చేసిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని పేర్కొన్నారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఇప్పటికైనా నీ నోరు, నీ ఒళ్ళు అదుపులో పెట్టుకో అంబటి రాంబాబు లేనిపక్షంలో మా సమాధానం మరోలా ఉంటుందని నాయకులు ముప్వ శ్రీనివాస్, దొంతు మంగేశ్వరరావు, ఎటపాక మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, సొసైటీ అధ్యక్షులు మాచినేని రాజేష్ ఘాటుగా హెచ్చరించారు. వయసు రీత్యా నోరు తప్పి మాట్లాడేసానంటే కుదరదని అంబటి రాంబాబు తప్పకుండా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# స్వచ్ఛ్‌భారత్ కార్యక్రమంలో పాల్గొన్న 'ఆదిత్య' విద్యార్థినులు




కాకినాడ,మేజర్‌న్యూస్ : స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ మరియు పి.జీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థినులు స్వచ్ఛ్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పార్క్‌లో శుభ్రత కార్యక్రమం నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈసందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జీ కళాశాలల అకడమిక్ డైరక్టర్ డా॥ బి.యి.వి.ఎల్.నాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పర్యావరణ పరిరక్షణ, పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం అని తెలిపారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ పార్క్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, తినుబండారాల ప్యాకెట్లు వంటి మలినాలను మా విద్యార్థినులు సేకరించి శుభ్రపరిచారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్క్‌లను శుభ్రంగా ఉంచడం మన అందరి బాధ్యత అని తెలిపారు.

ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవాలి. ఇలాంటికార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలనేది "మా ఆకాంక్ష" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్.శ్రీనువాసరావు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నవ్య మరియు అధిక సంఖ్యలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# మండల సమస్యలు నారా లోకేష్ బాబు దృష్టికి




## – కృతజ్ఞతలు తెలిపిన మండల అధ్యక్షులు

ఎటపాక, మేజర్ న్యూస్ : పోలవరం జిల్లా ఎటపాక మండలంలో వున్నా పలు సమస్యలను ఐటీ శాఖ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి ఎటపాక టీడీపీ మండల అధ్యక్షులు తీసుకెళ్లారు. శనివారం ఐటీ శాఖ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబును అమరావతి వద్ద గల సచివాలయంలో ఎటపాక టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చెప్పట్టిన నాటి నుంచి బ్యాక్ వాటర్ వలన గోదావరి వరదలు సంభావిస్తున్నాయి అని, ఆ వరదల కారణంగా నష్టపోతున్న గ్రామాలకు నష్ట పరిహారం అందించాలని, గోదావరి వరదల కారణంగా నష్ట పోతున్న ప్రతి కుటుంబానికి ఆర్ & ఆర్, భూ ప్యాకేజి అందించాలని, మండలంలో గ్రామీణ రహదారులు అధ్వన్నంగా వున్నాయి అని, కావున నూతన రహదారులు మంజూరు చేయాలనీ, మండలంలో వున్న భూ సమస్యలను ఐటీ శాఖ, విద్యా శాఖ మంత్రి లోకేష్ బాబుకు వివరించారు.

ఆయన వెంటనే స్పందించి మండలంలో వున్నా సమస్యలను త్వరనే పరిష్కారిస్తామని హామీ ఇవ్వడం జరిగింది అని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని బొల్లా పుల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

# వెంకన్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్యఅన్నదాన పథకానికి ఆదివారం విశాఖపట్నం,కుర్మన్నపాలెంకు చెందిన అలివేలు శృంగార జగదాంబ వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములతో సత్కరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు,సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# జగన్మోహిని కేశవస్వామి అభివృద్ధి పనులకు విరాళం




ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి నిత్యఅన్నదాన పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వేగిరాజు శ్రీనివాసరాజు, మహాలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకొని శ్రీ స్వామివారి ఆలయ అభివృద్ధి పనులు నిమిత్తం రూ.10,116లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. దాతలకు ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# కేంద్ర బడ్జెట్ ఆశాజనకం

– కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



కాకినాడ,మేజర్‌న్యూస్ : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉందని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. కేంద్రబడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో అన్ని రంగాలను సంతృప్తి పరిచేలా కేటాయింపులు చేయడం శుభ పరిణామమన్నారు. ముఖ్యంగా అపార ఖనిజ వనరులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గి ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీంతో పాటు ఐటీ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు 2047వరకు దేశంలో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లుకు 100శాతం పన్ను మినహాయింపు ఇవ్వడం హర్షణీయ మని, ఈ నిర్ణయంతో అనేక విదేశీ కంపెనీలు భరత్ లో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తాయిని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం పట్ల ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

సూర్య www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# అదృశ్య శత్రువుతో జాగ్రత్త



– సైబర్ ఉచ్చులో చిక్కుకోవద్దు
– సర్పవరం సిఐ పెద్దిరాజు అప్రమత్తత పిలుపు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కంటికి కనిపించని శత్రువు, గురితప్పని మోసం, ఒక్క చిన్న పొరపాటు మీ జీవితకాల సంపాదనను ఆవిరి చేయవచ్చు అని సర్పవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ పెద్దిరాజు హెచ్చరించారు. ఇటీవల కాకినాడ బోటు క్లబ్‌లో జరిగిన సీనియర్ సిటిజన్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

**నేరగాళ్ల ఆయుధాలు: భయం మరియు అత్యాశ**

సైబర్ నేరాలు కేవలం సాంకేతికత వల్ల జరగడం లేదని, మనిషిలోని అవగాహన లేమి, అనవసరమైన భయం, మరియు అత్యాశలను నేరగాళ్లు పెట్టుబడిగా మార్చుకుంటున్నారని సిఐ పెద్దిరాజు వివరించారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఈ మోసాలు ఇప్పుడు పల్లెలకు కూడా విస్తరించాయని, ముఖ్యంగా విశ్రాంత జీవితం గడుపుతున్న వృద్ధులే లక్ష్యంగా ఈ డిజిటల్ దొంగలు పంజా విసురుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రక్షణ కోసం సిఐ పెద్దిరాజు సూచనలు

– కొత్త నంబర్ల నుండి వచ్చే ఫోన్ కాల్స్ లేదా మెసేజ్ ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

– మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్, పాన్ కార్డ్ లేదా ఏటీఎం పిన్ నంబర్లను ఎవరికీ షేర్ చేయకూడదు.

– బ్యాంక్ అధికారులు ఎప్పుడూ మీ ఓటీపి అడగరని గుర్తుంచుకోవాలి.

– ఎవరైనా ఫోన్ చేసి తాము పోలీసులమని బెదిరిస్తే భయపడకుండా, వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– బంగారం ధరలు పెరుగుతున్నందున, ప్రయాణాల్లో మరియు బయటకు వెళ్ళేటప్పుడు ఆభరణాల పట్ల సీనియర్ సిటిజన్స్ మరింత అప్రమత్తంగా ఉండాలి.

**ముప్పు పొంచి ఉంటే ఏం చేయాలి?**

ఒకవేళ సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించాలని సిఐ సూచించారు. బాధితులు వెంటనే డయల్ 112 లేదా సైబర్ పోలీసుల నంబర్ 1930 కు సమాచారం అందించాలని కోరారు.ప్రజల క్షేమమే ధ్యేయంగా సిఐ పెద్దిరాజు అందిస్తున్న ఈ సూచనలు ఇప్పుడు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. అవగాహనే సైబర్ నేరాలకు అసలైన మందు అని ఆయన స్పష్టం చేశారు.ఆర్గనైజేషన్ అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అడబాల రత్నప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబుపై దాడిని ఖండించిన చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి అంబటి రాంబాబుపై జరిగిన దాడిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రత్యర్థులపై భౌతిక దాడులు చేయడం అత్యంత హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి లడ్డు ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేసిన అసత్య ప్రచారం పూర్తిగా బట్టబయలయ్యిందన్నారు. స్వామివారి లడ్డులో ఎటువంటి జంతు కొవ్వు పదార్థాలు కలవలేదని సిబిఐ స్పష్టంగా వెల్లడించడంతో, ప్రభుత్వ వైఫల్యాలు మరియు అబద్ధాలు ప్రజల ముందు బయటపడ్డాయన్నారు.

ఈ నిజాన్ని ప్రజల దృష్టి నుంచి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా మాజీ మంత్రి అంబటి రాంబాబుపై దాడి చేయించారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలాంటి చర్యలతో ప్రజల మనోభావాలను దెబ్బతీయాలని, ప్రతిపక్షాన్ని భయపెట్టాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దాడికి బాధ్యులైనవారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎప్పటికీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పించడమే సత్యసాయి సేవ కేంద్రం లక్ష్యం



– కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్స్ ప్రధానోత్సవం

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రావులపాలెం శ్రీ సత్యసాయి సేవా కేంద్రంలో 60 రోజులపాటు కంప్యూటర్ డిసిఏ కోర్సు శిక్షణ పూర్తి చేసుకున్న 40 మందికి మరియు 90 రోజులు టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 50మందికి సర్టిఫికెట్స్ ప్రధానోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈకార్యక్రమమునకు ట్రస్ట్ చైర్మన్ కొవ్వూరి వివేకానందరెడ్డి అధ్యక్షతన, రావులపాలెం బాయ్స్ హైస్కూల్ ఎస్ఎంసి చైర్మన్ నందం సత్యనారాయణ, గర్ల్స్ హైస్కూల్ ఎస్ఎంసి చైర్మన్ కోట సోమేష్ ముఖ్య అతిథులుగా విచ్చేసి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్స్ ప్రధానము చేసినారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బాబా వారి ఆశీస్సులతో రావులపాలెంలో ఎన్నో సంవత్సరాలుగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు అందరికీ ఎంతో అవసరమైన వైద్య సేవలు, పిల్లల్లో మంచి పరివర్తనకై బాలవికాస్ క్లాసులు, అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చేస్తున్నారని, ఇది ఈ గ్రామం చేసుకున్న అదృష్టమని అన్నారు. ఈ శిక్షణ మా కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో సహాయ పడతాదని, ప్రేమతో, చాలా చక్కగా శిక్షణ ఇచ్చినారని, సాయి సంస్థల్లో ఈ శిక్షణ తీసుకోవడం చాలా ఆనందం గా ఉందని శిక్షణ పొందిన మహిళలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ కొవ్వూరి బ్రహ్మారెడ్డి, నడింపల్లి రామకృష్ణంరాజు, సిద్ధిరెడ్డి రామకృష్ణ, రిటైర్డ్ ఆర్జెడి సత్యనారాయణరెడ్డి, ఎక్స్ ఆర్మీ ఆఫీసర్ చిన్నం రామకృష్ణారెడ్డి, వెలగల హరి రామచంద్రారెడ్డి, కర్రి సత్యనారాయణ రెడ్డి, మన్యం పర్వత వర్ధనరావు మొదలగువారు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవానికి భూమి పూజ



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం గుండాల పంచాయతీ గొల్లగట్ట గ్రామంలో ఫిబ్రవరి 26, 27, 28 తారీకుల్లో నాభిశిల బొడ్రాయి, శ్రీముత్యేశ్వరి ముత్యాలమ్మ, తల్లి పోతురాజు స్వామి, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించడం జరుగుతుంది. ఆ మహోత్సవ కార్యక్రమానికి ఆదివారం శంకుస్థాపన చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి బందారు శ్రీకాంత్, కుమార్తెలు యువన, సుస్మిత, మోక్షిత, నాగశ్రీ, ఊరి పెద్దలు పూజెం పసయ్య, గొంది ప్రసాద్, గొంది ఆదినారాయణ, కారం వెంకటేష్, మడివి రామారావు, పోడియం చిన్నారావు, గొంది వెంకటేష్, గొంది రామారావు, గుండి భాస్కర్, సల్లం గణేష్, కల్లూరి కృష్ణ, పూజెం శ్రీను, గ్రామ సభ్యులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాలకు చుట్టుపక్కల ప్రజలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ కోరారు.

## భక్తిశ్రద్ధలతో 'కోటి తులసి పూజ'..

రూ.లక్ష విరాళం ప్రకటించిన మద్రాసు దాత
– ఆలయ చైర్మన్, ఈఓ చేతుల మీదుగా రాజేంద్రకి ఘన సత్కారం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** శ్రీ స్వామివారి సన్నిధిలో అత్యంత వేడుకగా జరుగుతున్న 'కోటి తులసి పూజ' మహోత్సవం భక్తుల పాలిట ఆధ్యాత్మిక వరంగా మారింది. ఈ మహోత్కార్యంలో భాగంగా మద్రాసు వాస్తవ్యులు, ప్రముఖ దాత రాజేంద్ర తన ఉదారతను చాటుకున్నారు. పూజకు అవసరమైన తులసి దళాల నిమిత్తం అయ్యే లక్ష రూపాయల వ్యయాన్ని తానే భరిస్తానని ప్రకటించి, స్వామివారి పట్ల తనకున్న అచంచల భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాజేంద్ర ను ఆలయ పాలకమండలి చైర్మన్ రోహిత్ కార్యనిర్వహణాధికారి త్రినాధ రావు ఘనంగా సత్కరించారు. స్వామివారి శేష వస్త్రం కప్పి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దాతృత్వమే దైవత్వం..అనంతరం చైర్మన్ రోహిత్ మాట్లాడుతూ.. స్వామివారి సేవకి ఇలాంటి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ కోటి తులసి పూజలో భక్తులందరూ పాల్గొని తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు

– మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకొని వారి సమస్యలను ఎమ్మెల్యే బందారు సత్యానందరావు దృష్టికి తీసుకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు (బాబు) అన్నారు. తాడిపూడి పులిదిండి వెలిచేరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు సీఎం నారా చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వెలిచేరు గ్రామంలో అంబటి రాంబాబు దిష్టిబొమ్మ తగలబెట్టిన ఎన్డీఏ కూటమి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చెయ్యాలి అని, గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ముల్లపూడి భాస్కరరావు, తోటకూర సుబ్బరాజు, తోట రజిని, చిటికెన సత్యనారాయణ, గూడెల్ల నాగేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న 'తరంగ్'






**– అశోక్ నగర్ ఆదిత్య స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు**

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** స్థానిక అశోక్ నగర్ ఆదిత్య పాఠశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు 'తరంగ్ –2026' పేరిట ఉత్సాహంగా జరిగాయి. ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీవిద్య, కో–ఆర్డినేటర్ రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ అడిషనల్ కమీషనర్ కె.టి. సుధాకర్, గౌరవ అతిథిగా జెఎన్టియుకె ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన డైరెక్టర్ శృతిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కాంపిటేటివ్ ఎగ్జామ్స్ అద్భుత విజయాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ అశోక్ నగర్ ఆదిత్య పాఠశాల మొదటి సంవత్సరంలోనే విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసి అద్భుత విజయాలను సాధించిందని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీమతి. శ్రీవిద్య అకడమిక్ రిపోర్ట్ ద్వారా వివిధ కాంపిటేటివ్ ఎగ్జామ్స్,అబాకస్–వేదికా మాథ్స్ మరియు హేండ్ రైటింగ్ ఒలింపియాడ్ నందు సాధించిన విజయాలను తెలియజేసారు.ముఖ్య అతిథి కె.టి. సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులే ఈ దేశప్రగతికి సోపానాలని, అకుంఠితదీక్ష మరియు క్రమశిక్షణతో విద్యార్థినీ, విద్యార్థులు అందరూ మరిన్ని అద్భుత విజయాలు సాధించాలన్నారు.గౌరవ అతిథి డా. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆదిత్య పాఠశాల ఒక వేదిక అని అన్నారు.

అనంతరం విచ్చేసిన అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతి ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి. సుమారు 5 గంటల పాటు జరిగిన తరంగ్–2026 కార్యక్రమం ఆద్యంతం ఉల్లాస ఉత్సాహ భరితంగా ఎంతో స్ఫూర్తిదాయకంగా జరిగింది.తదనంతరం ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీవిద్య, కో–ఆర్డినేటర్ రాజేష్, కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ అడిషనల్ కమీషనర్ కె.టి.సుధాకర్, గౌరవ అతిథిగా జెఎన్టియుకె ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి. మురళీకృష్ణ పాఠశాల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా తమ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని కాపాడిన పోలీసులు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** తల్లిదండ్రుల వివాదంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న యువకుడిని ఆలమూరు పోలీసులు చాకచక్యంగా టెక్నాలజీ సహాయంతో పట్టుకుని కాపాడారు. వివరాల్లోకెళ్తే ఆత్రేయపురం పెద్దపేటకు చెందిన కాలా బత్తుల రవి కిరణ్ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని నిర్ణయించుకుని ఆదివారం రాత్రి తన సోదరి చిన్నారికి ఫోన్ చేసి చెప్పాడు. అయితే వెంటనే చిన్నారి పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో జిల్లా ఎస్పీ ఐటీ కోర్ టీంకు సమాచారం ఇచ్చి ఆ అబ్బాయి రవి కిరణ్ ఫోన్ నెంబరు ద్వారా లొకేషన్ ఎక్కడో తెలుసుకోగలిగారు. ఆలమూరు మండలం జొన్నాడ పాత బ్రిడ్జి వద్ద ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆలమూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆలమూరు ఎసై జి.నరేష్ అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకుని రవి కిరణ్ ను చాకచక్యంగా పట్టుకుని రక్షించారు. అయితే తల్లిదండ్రులు గొడవలు పడుతుండటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులకు తెలిపారు. ఇలా టెక్నాలజీ సహాయంతో యువకుడిని రక్షించిన జిల్లా పోలీసు బృందాన్ని పలువురు అభినందించారు.

# గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యం



**– అరకు చలి ఉత్సవాల్లో రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి ఛైర్ పర్సన్ శిరీషాదేవి**

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వ పాలనలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని, గిరిజన సంస్కృతి వారసత్వసంపదేనని అరకు చలిఉత్సవాల్లో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి ఛైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమాలతో పాటు గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి ఛైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరకు చలి ఉత్సవాలు' ముగింపు కార్యక్రమం ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి ఎమ్మెల్యే శిరీషదేవి పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి వారసత్వ సంపద లాంటిదన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఖ్యాతి పొందేలా శ్రద్ధ పెట్టడం చాలా మంచిదన్నారు. తద్వారా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. అలాగే అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఆర్ట్, క్రాఫ్ట్ ప్రదర్శన, ప్రముఖ పద్మాపురం గార్డెన్ వారు నిర్వహించిన పూల ప్రదర్శన,వివిధసాంస్కృతిక కార్యక్రమాలు ఆసక్తికరంగా ఉన్నాయన్నారు.అనంతరం పాడేరులో శంకర్ ఆడిటోరియం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే రాష్ట్ర నలుమూలల నుండి అరకు ప్రాంతానికి విశేష స్పందన లభించిందన్నారు.దీనికి ప్రత్యేకంగా శ్రద్ధవహించిన కూటమి ప్రభుత్వానికి ప్రజల మన్ననలు ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపురి గంగులయ్య, మాజీ ఎమ్మెల్యే, తెదేపా పాడేరు నియోజకవర్గం ఇంచార్జి గిడ్డి ఈశ్వరి,అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఏఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ శ్రీపూజ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానంపై మౌనం నిరాశాజనకం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** బడ్జెట్–2026లో పాత పెన్షన్‌పై మౌనం నిరాశజనకంగా ఉందని ఏపి యూటిఎఫ్ పోలవరం (రంపచోడవరం) జిల్లా అధ్యక్షుడు గడిపే విశ్వరాజ్ ఆదివారం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్–2026 లో లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్న పాత పెన్షన్ విధానం గురించి ఏ విధంమైన ప్రస్తావన లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని యూటిఎఫ్ పోలవరం జిల్లా, అధ్యక్షుడు గడిపే విశ్వరాజ్ తెలియచేశారు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ సేవకాలం అనంతరం గౌరవప్రదమైన, భద్రమైన జీవితం గడపడానికి పాత పెన్షన్ విధానం అత్యవసరమని ఆయన తెలియజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సామాజిక భద్రతపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం బాధాకరమన్నారు. ఇప్పటికే దేశంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ అమలు దిశగా నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే దారిలో ముందడుగు వేయవలసిన అవసరం ఉందని విశ్వరాజ్ డిమాండ్ చేశారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం



**– పాల్గొన్న భక్తులు**

**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్‌కె.విజయలక్ష్మీఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈకార్యక్రమంలో భక్తులుఅమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

**–రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టి సంక్షేమ కమిటీ ఛైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి భాస్కర్ డిమాండ్**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** దార్శనికుడు, ప్రపంచ మేధావి, ఆంధ్రరాష్ట్ర పునఃనిర్మాణ ప్రదాత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను నోటికి వచ్చినట్లు, జుగుప్సాకర మాటలు మాట్లాడం ఏమిటని..? మీకు అలాంటి మాటలు మాట్లాడడం సిగ్గు అనిపించడం లేదా..? మంత్రి చేశారు..? ఎమ్మెల్యే చేశారు..?మీ సంస్కారం ఇదేనా..?మీకూ కుటుంబం ఉంది..? ఆడవారుంటారూ, ఆడపిల్లలుంటారు, మీరు మాట్లాడే మాటలు తప్పనిపించడం లేదా..? అని అంబటి రాంబాబును ప్రశ్నించారు. మీ మాటలు పట్ల చంద్రబాబు నాయుడు ను బేషరతుగా క్షమాపణలు కోరండి. సభ్యసమాజంలో ఇలాంటి మాటలు వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు ఏర్పడతాయి.ఇప్పుడిప్పుడే మీ వైసీపీ అరాచకత్వం లో అన్ని వ్యవస్థలు నాశనం చేశారు. అవన్నీ మా కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్, లోకేష్‌లు చక్కదిద్దుతున్నారు. మీ అసందర్భ,అసహ్యాకర, అభ్యంతరకర వ్యాఖ్యలతో సమాజాన్ని భ్రష్టు పట్టించకండి. చంద్రబాబును బేషరతుగా క్షమాపణలు కోరకపోతే మహిళా కమీషన్ సుమోటోగా కేసు నమోదు చేయించి అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నాను అని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్ అన్నారు.

# రోటరీ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ విజయవంతం







**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రోటరీ క్లబ్ 3020 డిస్ట్రిక్ట్ కాన్ఫిరెన్స్ విజయవంతం అయిందని డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. కాకినాడ కుసుమ సత్య ఫంక్షన్ హాల్లో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ కాన్ఫిరెన్స్ ఘనంగా ముగిసింది.

3వ రోజు కార్యక్రమానికి రోటరీ క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ తడాల బుజ్జి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలోభాగంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్షన్ జరిగింది. డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. కళ్యాణచక్రవర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గవర్నర్ నామినీ శోభన్ ప్రకాష్ను, ఎలెక్ట్ గవర్నర్ జి.శ్రీరాము సభకు పరిచయం చేసారు. అదే విదంగాపాస్ట్ గవర్నర్లను డా.కళ్యాణ్ చక్రవర్తి బృందం ఘనంగా సత్కరించింది. డిస్ట్రిక్ట్ కాన్ఫిరెన్స్లో పాల్గొన్న అతిధులును గవర్నర్ డా.కళ్యాణ్ సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ముగింపోత్సవంలో భాగంగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.కళ్యాణ్ చక్రవర్తి సభ్యులను ఉద్దేశ్యంచి ప్రసంగించారు.

అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో వీణా విద్వాంసులు ఫణినారాయణ్ సంగీత కచ్చేరి, ప్రముఖ సిని గేయ రచయితి గాయకుడు అనంత శ్రీరామ్ పాటల కార్యక్రమం జరిగింది. అనంత శ్రీరామ్ పాడిన పాటలకు ఫంక్షన్ హాల్ ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో మారమ్రోగింది.

ఈసందర్భంగా గవర్నర్ డా.కళ్యాణ్ చక్రవర్తి, కాన్ఫిరెన్స్ చైర్మన్ తడాల వరప్రసాద్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ కాన్ఫిరెన్స్ ద్వారా రోటరీ ఇంటర్ నేషనల్కు సుమారు 90 లక్షల రూపాయలు విరాళం సేకరించినట్లు వెల్లడించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన డిస్ట్రిక్ట్ కాన్ఫిరెన్సును విజయవంతం చేసిన రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో కాకినాడ అన్ని రోటరీ క్లబ్స్ ప్రెసిడెంట్ సెక్రటరీ ట్రెజరర్స్ తోపాటు రోటేరియన్స్ రోటరాక్టర్స్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన శేషారావు



**పెరవలి, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాలు మరియు నిడదవోలు పట్టణం నందు ఇటీవల అనారోగ్యానికి గురై వివిధ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఫిబ్రవరి 1 వ తేదీ ఆదివారం 79 మందికి రూ 44,22,800 రూపాయల చెక్కులను వేలివెన్ను గ్రామంలో క్యాంపు కార్యాలయం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ & మాజీ శాసనసభ్యులు మరియు నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అందజేశారు.

ఈ కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ కూటమి పార్టీలమండల, పట్టణ, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గానికి సంబంధించిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సుమారుగా కోట్ల రూపాయలు మంజూరు చేయించి లబ్ధిదారులకు అందచేసినబూరుగుపల్లిశేషారావును నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పెరవలి ఉండ్రాజవరం నిడదవోలు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని నిత్యాన్నదాన పధకానికి రూ.1,00,000లు విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నరసరావుపేట వాస్తవ్యులు నిమ్మల వెంకట శ్యామ్ ప్రసాద్ రూ.1,00,000లు విరాళమును దేవస్థానం పిఆర్ఓ అనకాపల్లి ప్రసాద్‌కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో డిసెంబర్ 15 వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు. దాతను పిఆర్ ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## అవార్డు పొందిన ఎంఈఓలకు ఘన సన్మానం



**పెరవలి, మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 1 వ తేదీ శనివారం పెరవలి ఎం.ఆర్.సి నందు తూర్పు గోదావరి జిల్లా ఉత్తమ విద్యాశాఖాధికారులుగా గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ ఎం.ఈ.ఓస్ అవార్డు అందుకున్న బి బి ఎస్ స్వరూప్ ఎంఈఓ 1, షేక్ సూర్జాన్ ఎంఈఓ2 లకు పెరవలి మండలపరిషత్ అధ్యక్షులు కార్చెర్ల సీతారామ ప్రసాద్ మరియు పెరవలి మండల ఉపాధ్యాయులచే ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి ఉత్తమ ఎంఈఓలు పెరవలి మండలంకు దొరకడం మన అదృష్టం అన్నారు. అనంతరం ఎంపీపీ ప్రసాద్ చేతుల మీదుగా రాష్ట్రోపాధ్యాయ సంఘం వారి ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లాకుల దుర్గారావు, అర్జునుడు, కే.వెంకటేశ్వరరావు, రవికుమార్, ప్రసాద్, సిహెచ్ శ్రీనివాస్, మూర్తి, పతంజలి, రమణ, శ్రీనివాస్, శాంతారావు, తారాకృష్ణ, మహేష్, ఆర్.వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, నరేంద్ర, రాముడు, శ్రీనివాస రెడ్డి, విజయ, దుర్గాదేవి, బేబీ గౌరి పాల్గొన్నారు.

## మండల టిడిపి అధ్యక్షుడు అతికాల శ్రీను జన్మదిన వేడుకలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అతికాల రామకృష్ణమ్మ (శ్రీను) పుట్టిన రోజు సందర్భంగా ఫిబ్రవరి 1 వ తేదీ ఆదివారం వేలివెన్ను గ్రామం క్యాంపు కార్యాలయం నందు నిడదవోలు నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తల తో కలిసి కేక్ కట్ చేయించి శు భాకాంక్షలు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ మాజీ శాసనసభ్యులు మరియు నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండలానికి సంబంధించిన తెదేపా నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని మండల అధ్యక్షులు అతికాల శ్రీనుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# దోపిడీదారులు అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదం



కొత్తపేట, మేజర్ న్యూస్ : దోపిడీదారులు అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి అన్నారు. వైసీపీ నేతలు చంద్రబాబును బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకాన్ని సిగ్గు లేకుండా సమర్థించుకున్న ఘనత వైసీపీ నాయకులదని అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి దివంగత నేత వంగవీటి మోహనరంగా రావుపై వల్లమాలిన ప్రేమను ఒలకపోస్తున్నారు.సామాజిక వర్గానికి చెందిన ముద్రగడ పద్మనాభ రెడ్డి, అంబటి రాంబాబులు జగన్మోహన్ రెడ్డి ప్రయోజనాల కోసం పాకులాడటం తప్ప సొంత సామాజిక వర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. నాడు కాపు రిజర్వేషన్ ఉద్యమంలో దివంగత నేత సలాది స్వామి నాయుడు అనుచరులపై లాఠీచార్జ్ చేయించింది ఎవరని.. నిన్నటికీ నిన్న రావులపాలెంలో రాయలవారి విగ్రహాన్ని అడ్డుకున్నది ఎవరు అని ప్రశ్నించారు.రాయలు వారి చిత్రపటాన్ని అవమానించిన జగ్గిరెడ్డి నీతులు చెబుతున్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు అభివృద్ధికి దోహదపడుతున్న సీఎం చంద్రబాబు పాలన చూసి కడుపు మంటతో తట్టుకోలేక వైసీపీ నేతలు బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. వైసీపీ నేతలు రాష్ట్రంలో మళ్ళీ బూతుల సంస్కృతిని తెరపైకి తెస్తూ రాజకీయాలను కలుషితం చేస్తున్నారు. గొడవలు, హత్యలకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. గతంలో అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు కుటుంబాన్ని అంబటి రాంబాబు అవమానించారు. అంతే కాకుండా నేడు అంబటి మరల చంద్రబాబుపై దుర్భాషలాడుతున్నారు. అంబటి వంటి వారిని ప్రోత్సహించి జగన్మోహనరెడ్డి రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని తెదేపా శ్రేణులు మండి పడ్డారు.కొత్తపేట మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్,మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వర రావు, క్లస్టర్ ఇంఛార్జు బూసి భాస్కర రావు, పల్లి ఏసు, తెలుగు యువత నిమ్మకాయల చిన్నయ్య నాయుడు తదితరులు ఉన్నారు.

### యుటిఎఫ్ ఆధ్వర్యంలో గంజాయి నష్టాలపై అవగాహన



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు గురుకుల పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ నాయకులు అక్కడ చదువుతున్న విద్యార్థులకు గంజాయి వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించడం జరిగింది. రాష్ట్ర యుటిఎఫ్ నాయకత్వం పిలుపుమేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల యుటిఎఫ్ అధ్యక్షుడు గాంధీరెడ్డి ప్రధాన కార్యదర్శి కెవి రాఘవులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులతో మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటి బారిన పడితే ఆరోగ్యం పాడు చేసుకోవడమే కాకుండా సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతారని వెల్లడించారు. అలాగే ముందుగా యువత మద్యపానం ధూమపానం వంటి అలవాట్లు బారినపడి తద్వారా గంజాయి వంటి చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని తెలిపారు. చదువుకున్న విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకొని తమ గ్రామాల్లో కూడా తోటి వారికి అవగాహన కల్పించాలని సూచించారు

# ఉచిత వైద్య శిబిరంలో 250మందికి వైద్య సేవలు





**– రోగులకు, వారి సహాయకులకు అన్నదానం**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరంలో ఆదివారం 250 మందికి వైద్య సేవలు అందించారు. రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం శివారు సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియజేసారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 250మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పోతుల రామారావు, డాక్టర్ దాసరి ఉమా మహేష్, వైద్య సిబ్బంది సుమారు 250 మందికి వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న రోగుల్లో 74 మందికి రక్త పరీక్షలు, 10 మందికి థైరాయిడ్ పరీక్షలు, 12 మందికి ఇ.సి.జి లు, 11 మందికి ఎక్స్‌రేలు చేసినట్లు స్వామిజీ తెలిపారు.

కాగా వైద్య శిబిరానికి హాజరైన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల ప్రజలు రామకృష్ణ మిషన్ అందించే ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని స్వామిజీ విజ్ఞప్తి చేసారు.

ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్యసేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు వెంటనే క్షమాపణ చెప్పాలి



**– మండల టీడీపీ నాయకులు**

**ఎటపాక, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు నాయుడుని అసభ్య పదజాలంతో విమర్శించడం చాలా దురదృష్ట కరమని, ఎటపాక మండల నాయకులు, వైకాపా మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వాక్యాలపై నాయకులు తీవ్రంగా స్పందించారు. తక్షణమే నారా చంద్రబాబు నాయుడుకి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఊరుకోమని, తండ్రి లాంటి మా నాయకుడిని అసభ్య పదజాలంతో మాట్లాడటం నీకు నోరు ఎలా వచ్చిందని వారు అన్నారు.

రాష్ట్రంలో కూటమి పాలనలో, నారా చంద్రబాబు నాయకత్వంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి పదంలో మొదటి స్థానంలో ఉందని, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేక మా నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వైకాపా నాయకుల దిగజారుడుతనాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని వారు తెలియజేశారు. తప్పుచేసి అంబటి రాంబాబు తప్పించుకోలేవని, కచ్చితంగా చేసుకున్న కర్మకి ప్రాయశ్చిత్తు చెల్లించుకోవాల్సిందేనని ఘాటుగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, సీనియర్ నాయకులు పాటి చలపతి, కానూరి పుల్లబ్బాయి, కిలారి వెంకన్న, పాటి సంపత్, నలజాల శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు, బాచినేని శ్రీకాంత్, చేకూరి రమేష్, విజ్జగిరి రవితేజ, మాజీ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలన సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యం కల్పిస్తుంది

**–అరకు చలి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే,**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ శిరీషాదేవి**



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమాలతో పాటు సంస్కృతి సంప్రదాయాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరకు చలి ఉత్సవాలు ముగింపు రోజైన ఆదివారం రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలితో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి వారసత్వసంపద లాంటిదన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు కూడా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఖ్యాతి పొందేలాగున శ్రద్ధ పెట్టడం చాలా మంచిదన్నారు. తద్వారాఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. అలాగే అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఆర్ట్ మరియు క్రాఫ్ట్ ప్రదర్శన, ప్రముఖ పద్మాపురం గార్డెన్ వారు నిర్వహించినపూల ప్రదర్శన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆసక్తికరంగా ఉన్నాయన్నారు. అనంతరంపాడేరులో శంకర్ ఆడిటోరియం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే రాష్ట్ర నలుమూలల నుండి అరకు ప్రాంతానికి విశేష స్పందన లభించిందన్నారు. దీనికి ప్రత్యేకంగా శ్రద్ధ వహించిన కూటమి సర్కార్‌కి ప్రజల మన్ననలు ఉండాలని కోరారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య, మాజీ ఎమ్మెల్యే, తెదేపా పాడేరు నియోజక వర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ ఏఎస్ దినేశ్ కుమార్, సంయుక్త కలెక్టర్ శ్రీ పూజ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి వేగం చేకూర్చే విధంగా బడ్జెట్

**–రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదిగా బడ్జెట్**

**–ఎమ్మెల్యే బండారు**



**కొత్తపేట,మేజర్‌న్యూస్ :** ప్రపంచ ఆర్థిక పరిణామాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి వేగం చేకూర్చే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వివరించారు. దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే దిశగా ఆదివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఒకే ప్రధాని హయాంలో తొమ్మిదవసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం అరుదైన ఘనత అని పేర్కొంటూ, నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. అలాగే పార్లమెంట్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ ప్రసంగం చేసి కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలకు భరోసా ఇచ్చారని చెప్పారు.

వ్యూహాత్మక రంగాల్లో మాన్యుఫాక్చరింగ్ పెంపు, పారిశ్రామిక వారసత్వ పునరుద్ధరణ, ఎమ్.ఎస్.ఎమ్.ఈ లను జాతీయ స్థాయి చాంపియన్లుగా తీర్చిదిద్దడం, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం, సిటీ ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధి వంటి ఆరు కీలక సూత్రాలపై ఈ బడ్జెట్ ఆధారపడిందన్నారు. మౌలిక సదుపాయాల రంగానికి భారీ కేటాయింపులు చేసి జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి ప్రాధాన్యత గృహ నిర్మాణ రంగానికి మరింత ఊతం ఇచ్చేలా పట్టణ, గ్రామీణ గృహ పథకాలకు అధిక నిధులు, రైతుల ఆదాయం పెంపునకు సాగునీటి ప్రాజెక్టులు,ప్రకృతి వ్యవసాయం,రైతు ఉత్పత్తి సంస్థలకు మద్దతు మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణ పరిమితి పెంపు,మహిళా సాధికారతకు ప్రత్యేక కార్యక్రమాలు

యువతకు నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం,డిజిటల్ ఇండియా విస్తరణ గ్రీన్ ఎనర్జీ,హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలకు మద్దతు ఇచ్చే విధానాలు రక్షణ రంగంలో స్వదేశీ తయారీ పెంపు,ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి బలమైన చర్యలు వ్యవసాయం, రక్షణ, విద్య,వైద్యం, గ్రామీణ––పట్టణాభివృద్ధి, సామాజిక సంక్షేమం వంటి రంగాలకు సముచిత కేటాయింపులు చేసి అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు రూ. 12 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చే నిర్ణయమని అన్నారు.క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల చికిత్సకు అవసరమైన వైద్య వసతులు మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని బండారు సత్యానందరావు చెప్పారు.జిల్లాకో గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు,సైన్స్,టెక్నాలజీ, ఇంజనీరింగ్,మెడిసిన్ వంటి ఉన్నత విద్యా కోర్సులకు ప్రోత్సాహం,అమరావతి రాజధాని అభివృద్ధికి ఏడీబీ నిధులుగా రూ. 1,128.91 కోట్లు,అమరావతి సమగ్ర పట్టణాభివృద్ధికి జపాన్ నిధులు,గ్రామీణ రహదారి ప్రాజెక్టులు,పట్టణ తాగునీరు–మురుగు నీటి పారుదల,పోలవరం ప్రాజెక్టుకు భారీ కేటాయింపులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు.ఏపీలో ఎన్డీఏ కూటమి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విశ్వాసం వ్యక్తం చేశారు.

# మాజీ మంత్రి అంబటిపై కఠిన చర్యలకు డిమాండ్

### – మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి అంబటి రాంబాబు అహంకార పూరిత వ్యాఖ్యలు, అసభ్యకర బూతులపై కఠిన చర్యలు తీసుకోవాలని రంపచోడవరం మాజీ శాసన సభ్యులు శీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆదివారం డిమాండ్ చేసారు. వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సాక్ష్యాత్తు శ్రీవారి సొమ్ము రూ.250 కోట్లు దోపిడి చేయడమే కాకుండా, పవిత్రమైన శ్రీవారి ప్రసాదం లడ్డు తయారీలో ఆవు నెయ్యి బదులుగా, 69 లక్షల కిలోల కల్తీ కెమికల్ నెయ్యి వాడటమే కాకుండా, సిట్ రిపోర్టు ద్వారా 36 మంది ఈ పాపంలో భాగం అయ్యారని చెప్పినా సరే ప్రభుత్వంపై నిందలు వేస్తారా? అని ప్రశ్నించారు. మీరు చేసిన తప్పులు ప్రజలకు వివరించేలా ఫ్లెక్సీలు వేయిస్తే రౌడీయిజంతో వాటిని తొలగించే ప్రయత్నం చేసారని ఆరోపించారు. మీరు చేసేది తప్పు అని అడ్డుకుంటే సాక్ష్యాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీద సభ్య సమాజం తల దించుకునేలా వ్యాఖ్యలు చేస్తారా? ఆయన ఆగ్రహం వ్యక్తంచేసారు. అంబటి చేసేవి విమర్శలు కాదని, తప్పు చేసినా మమ్మల్ని ఏమీ చేయలేరు అనే అహంకారంతో వాగిన చిల్లర వాగుడని, వైయస్సార్ బూతు పార్టీ నాయకుడిగా బండ బూతులతో రెచ్చి పోయిన అంబటి రాంబాబును అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవాన్ని కాపాడలేకపోతే, ఇక సామాన్యులపై జరిగే దాడులను ఎలా అరికట్టగలమన్నారు. ఒక మాజీ మంత్రిగా హుందాగా వ్యవహరించాల్సిన అంబటి రాంబాబు బజారు రౌడీలా ప్రవర్తించి, ప్రజలకు ఏం సందేశం ఇచ్చినట్లు? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి పోలీసులు అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలా మరే ఇతర నాయకుడు ప్రవర్తించకుండా న్యాయస్థానం కఠనంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేసారు.

## శ్రీ సత్యదేవ నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,011లు విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు వాస్తవ్యులు జె.వెంకటరమణ రూ.1,00,011లు విరాళంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావుకు అందజేశారు. దాత దీనిపై వచ్చే వడ్డీతో చైత్ర శుద్ధ పాడ్యమి జె.కాసుల, జె.వరహాలమ్మ పేరు మీద అన్నదానం జరిపించాలని దాత కోరినారు. దాతలను దేవస్థానం అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

## మండల యువజన అధ్యక్షుడిగా కుశరాజు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండల వైఎస్ఆర్సిపి యువజన అధ్యక్షుడిగా నాగులపల్లి కుశరాజు నాలుగోసారి నియమించబడ్డాడు. వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ అనంత బాబు, ఎక్స్ ఎమ్మెల్యే ధనలక్ష్మి, మండల వైస్సార్సీపీ పార్టీ ప్రెసిడెంట్ సింగిరెడ్డి రామకృష్ణ, అడ్డతీగల జడ్పీటీసీ మద్దాల వీర్రాజు,స్టేట్ వింగ్ యువజన విభాగం జనరల్ సెక్రెటరీ & జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్ రాజు, నియోజకవర్గం పంచాయతీ విభాగం అధ్యక్షులు కనిగిరి దుర్గాప్రసాద్, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు అధ్య రమేష్, పార్టీ మండల బూత్ కమిటీ ప్రెసిడెంట్ అడపా కమేష్, సర్పంచులకు వైస్ ఎంపీపీలకు, ఎంపీటీసీలకు పంచాయతీ ఇన్చార్జీలకు, యూత్ సభ్యులకు, పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు ఈ సందర్బంగా కుశరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు.

# అన్నవరంలో భక్తజన సంద్రం





### – మాఘ పౌర్ణమి వేళ పోటెత్తిన భక్తులు

**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం రత్నగిరి క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రమైంది. మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే భక్తులు పవిత్ర పంపా నదిలో స్నానాలు ఆచరించి, స్వామివారి వ్రతాల్లో పాల్గొన్నారు.

అధికారుల అప్రమత్తత – ప్రత్యేక ఏర్పాట్లు : భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఈవో వేంద్ర త్రినాధరావు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

చిన్నారులకు పాలు, బిస్కెట్లు : క్యూ లైన్లలో వేచి ఉన్న చిన్న పిల్లల కోసం పాలు, బిస్కెట్లు మరియు త్రాగునీరు నిరంతరాయంగా అందజేశారు.ప్రసాద వితరణ: రామాలయం ఎదురుగా ఉన్న సెక్యులర్ మండపం వద్ద నిత్య అన్నదానం విభాగం ఆధ్వర్యంలో భక్తులకు దద్దోజనం, పులిహోరను పంపిణీ చేశారు.

పర్యవేక్షణ : దేవస్థానానికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకూడదని అధికారులకు, సిబ్బందికి ఈవో ముందుగానే కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.క్షేత్రమంతా 'ఓం నమో శ్రీ సత్యనారాయణాయ' అనే నామస్మరణతో మారుమోగిపోయింది. రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ, దేవస్థాన సిబ్బంది మరియు పోలీసుల సమన్వయంతో భక్తులు క్రమశిక్షణతో స్వామివారిని దర్శించుకున్నారు.

## మాఘ పౌర్ణమి సందర్భంగా అంతర్వేదిలో చక్రస్నానం



**సఖినేటిపల్లి,మేజర్న్యూస్ :** అంతర్వేది చక్రస్నానం మహోత్సవం శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి 1 వతేదీ ఆదివారం మాఘ పౌర్ణమి నాడు సముద్ర తీరంలో గోదావరి, వశిష్ఠ గోదావరి, సముద్ర సంగమం వద్ద శ్రీ స్వామి వారి చక్రస్నానం వేడుకలను సుమారు నాలుగు లక్షల మంది భక్తులు హాజరై ఆద్యంతం ఎంతో ఘనంగా నిర్వహించారు. తొలుతగా వేద పండితులు స్వామి వారి పెరుమాళ్ల కళ్యాణ మూర్తులను గరుడ పుష్పక వాహనంపై మంగళ వాయిద్యాలతో సముద్ర తీరానికి తీసుకుని వచ్చి జల్లు స్నానం ఆచరింపజేశారు. భక్తులు స్వామి స్నానం తర్వాత పుష్కర పుణ్య ఫలం కోసం వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో సముద్ర స్నానాలు ఆచరించారు. స్వామి వారి భక్తులు భక్తి శ్రద్ధలతో సముద్ర స్నానాలు ఆచరించారు. వేద మంత్రోచ్చారణలు, గోవిందా నామస్మరణల మధ్య భారీ బారికేడ్లు, బందోబస్తు ఏర్పాట్లతో ఎంత వైభవంగా నిర్వ హించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాల యంలో చక్రస్నానం మహోత్స వం ఒక ముఖ్యమైన ఆచారంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది . స్వామి వారు రక్తావలోచన రాక్షసుడిని సుదర్శన చక్రంతో వధించిన తర్వాత, చక్ర తీర్థంలో (కలను) స్నానం చేసిన ఆచారం ఉంది

భక్తులు గోవింద నామస్మరణలు చేస్తూ పాల్గొంటారు.అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో చక్రస్నానం మహోత్సవం మాఘ పౌర్ణమి రోజున నిర్వ హించారు ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు దేవ వరప్రసాద్ ఆర్డీవోలు డి.అఖిల శ్రీకర్ పోలీసు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్.నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతి ఆదివారం నిర్వహించే సేవా కార్యక్రమాలలో భాగంగా 40 మంది వాలంటీర్లు బృందాలుగా విడిపోయి కళాశాల పరిసర ప్రాంతాలను, సమీపంలో గల పబ్లిక్ పార్క్ ను శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, పొడి చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వీస్ కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి ఆదివారం సేవకు కొంత సమయాన్ని కేటాయించడం అభినందించే విషయమని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ విషయమై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత తగ్గించే ప్రయత్నం చేయాలని అన్నారు. స్వచ్ఛభారత్ నిర్మాణం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.